# ఆరనిజ్యోతి

—భారతి

ఆసుపత్రి ఆవరణ అంతా నిశ్శబ్దంగా వుంది. అంతులేని నిశ్శబ్దం. ఉన్నట్టుండి కలకలం మొదలయింది. అంత వరకూ మూలకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న సిస్టర్సంతా తమ తెల్లటి గౌనులు రెపరెపలాడించుకుంటూ హడావిడిగా తిరుగుతున్నారు.

దీనికంతటికీ కారణం ఏమిటో నని మెల్లిగా, అతిబలవంతముగా కళ్ళు తెరిచాను. చుట్టూరా వెతికేస్తున్న నా చూపులు గుమ్మం దగ్గర ఆగి పోయాయి. అక్కడి నుంచి మెల్లగా కదులుతోంది, లేడీడాక్టర్ తెల్లనివన్నెంచుచీరె, తెల్లకోటు, చుట్టిన చుట్టలో అర విచ్చిన తెల్లని సైకిస్కావు. ఇదీ ఆమనిషి ఆకారం. ఆమెనే చూస్తున్నాను నేను.

"నమస్కారమమ్మా!"

"నమస్కారం తాతా! ఎలా వుంది ఒంట్లో? నీరసమేమైనా తగ్గినట్టుందా?" మెత్తని స్వరాన అడుగుతోందామె ఒక బెడ్ మీది పేషెంట్ని.

"ఏంతగ్గట మోవమోనమ్మా! రోజురోజుకీ ఎక్కువౌతోంది. ఎంతతిన్నా ఎక్కడినుంచి వస్తుందో ఆ నీరసం ఎవ్వడో అదేనన్ను తినేస్తుందమ్మా!"

"అంతవిరక్తి కూడదు తాతా! ధైర్యముగావుండాలి! నువ్వు తొందరలోనే మీ ఇంటికి వెళ్ళి హాయిగా మనుమలతో, మనుమరాళ్ళతో ఆడుకుంటావు తెలుసా!" ఉత్సాహం కలిగించేట్టుగా నవ్వింది.

ఆ బెడ్ని దాటింది. నా చూ

పులు ఆమె వెంటే వస్తున్నాయి.

"ఇంకా ఎన్నాళ్ళండి డాక్టర్ నేనుమీ అధీనంలో ఉండటం? విముక్తి కలిగిస్తారా నా కసలు" చిన్నగా నవ్వుతూ అడిగాడు మరో బెడ్ మీది యువకుడు

"అలా నిష్ఠూరంగా మాట్లాడితే మేమేం చెయ్యగలం మిస్టర్! మీ చేతి దెబ్బ నయమవగానే మళ్ళీ మీ ఫ్రెండ్స్‌తో కలవొచ్చు, అయినా మళ్ళీ వెళ్లి క్రికెట్ ఆడటానికేగదా. ఆడటం దెబ్బలు తగిలించుకోటం మీవంతు కట్టుకట్టి పడెయ్యటం మావిధి" చిరునవ్వుతో ముందుకు సాగిపోయింది.

పాలనురగలాంటి స్వచ్ఛమైన చిరునవ్వు అంతకంటే కోమలమయిన కంఠస్వరం ఎక్కడో పరిచయమున్న గొంతుకలావుంది కానీ ఎక్కడ?

ఆమె ఒక్కొక్కరినే పలకరించి ముందుకి సాగుతూనే వుంది నామనస్సు ఎన్నో జ్ఞాపకాల పుటలను తిరగేస్తోంది. ఎవరీమె?

"అయ్యయ్యో! ఇదేమిటి సిస్టర్! ఇతని నుదుటిమీది కట్టు ఎలా వూడిపోయింది? బ్యాండేజ్ సర్గా చెయ్యలేదా? రక్తం చూడండి ఎలా కారిపోతుందో" ఆదుర్దాగా అంటూ అతని వద్దకు పరిగెత్తిందామె.

ఉలిక్కి పడ్డాను. ఇదే ఆదుర్దా నిండిన గొంతుకతో నాకు పరిచయమున్న కంఠమిది. పదేనిమిదేళ్ళ క్రితం ఏడేళ్ళమున్నీ నాకిలాగే పరిచయమైంది.

మున్నీ! ఏనాటి మున్నీ! ఎక్కడి కలకత్తా? ఎక్కడి బెంగుళూరు? నామనస్సు గతంలోకి సంకెళ్ళులేని గుఱ్ఱంలాగా పరిగెత్తుతోంది.

కలకత్తా మహా నగరంలో తనకు రెండురోజులుగా చేతికి పని దొరక్కపోవటంతో పస్తు వున్నాడు. మూడోరోజున ఎలాగయినా తనవృత్తిని కొనసాగించాలని బయల్దేరిన తనకు ఆరోజు కూడా చుక్కెదురయింది. వినా పట్టుదలతో ఆకలికడుపుని మంచినీళ్ళతో తృప్తి పరుస్తూ, రోడ్ల మీది హోటల్స్‌లోని జనాన్ని కొరకొరా చూసుకుంటూ నడుస్తున్నాడు తను.

కళ్ళు తిరుగుతున్నాయి ఒళ్ళు తూలిపోతుంది. అడుగుముందు-

వెయ్యడానికి శరీరం నిరాకరిస్తోంది. అయినా అలాగే నాలుగడుగులు వేశాడుతను. ఇహ శరీరం తన మాట వినదని సమ్మె చేసింది అంతే తూలి పడిపోయాడు.

ఏవో మాటలు వినిపిస్తున్నాయి. కానీ కళ్ళు తెరవలేక పోతున్నాడతను.

"అమ్మా! అమ్మా! ఎవరో పడిపోయారు చూద్దాం రా అమ్మా!" చిన్న పిల్లగొంతుకలా వుంది. "రోడ్డుమీద ఎవరో పడిపోతే నీకెందుకే అంత ఖంగారు?" తల్లి కాబోలనుకున్నాను.

"కాదమ్మా పాపం! చూద్దాం రా అమ్మా!" గారంగా అడుగుతోందా పిల్ల.

పట్టుకుంటే వదలవు కదా! సరేపద" విసుగ్గా వున్నాయామె మాటలు. కాస్సేపటికి గేటు తీసిన శబ్దం నాదగ్గరగా వచ్చేశారు వాళ్ళు. నా తలమీదొక మృదువైన చెయ్యి పడింది. ఉలిక్కిపడ్డాను నేను. నీరసంగా కళ్ళు తెరిచాను. ఏడేళ్ళపిల్ల నా మొహంమీద మొహంపెట్టి ఆదుర్దాగా చూస్తోంది.

కళ్ళు తెరిచాడమ్మా! చూస్తున్నాడు! ఇంట్లోకి తీసుకెళదాం పదమ్మా" సంతోషంగా అంది.

"నువ్వాకవకు మున్నీ! నాన్నగారినిటు పిలువు" ఆజ్ఞాపించిందామె.

మున్నీ మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది. కాస్సేపటికే ఒక మధ్య వయస్కుడితో తిరిగి వచ్చింది.

"చూడండి పాపం! చాలా నీరసంగా వున్నాడు! నడవలేడేమో! మెల్లగా లోపలికి తీసుకు రండి" జాలిగా చెప్పింది మున్నీ అమ్మ.

"అరెరె! నువ్వెళ్ళి పక్క వెయ్! నేనితడిని తీసుకువస్తాను" అంటూ నా అనుమతి లేకుండానే నన్ను రెక్కపుచ్చుకుని లేవనెత్తి ఇంటివేపుగా నడిపిస్తున్నాడాయన. మున్నీ నా రెండో చేతిని పట్టుకుంది.

లోపలికి తీసుకువెళ్ళి పడుకోబెట్టారు. వేడివేడి కాఫీ తాగించారు. అప్పటికి గానీ నాలోని ఆత్మారాముడు తేరుకోలేదు.

"చూడండి, వేడి నీళ్ళు

నాన్నయి! స్నానం చెయ్యండి! కాస్త ప్రాణం తేరుకుంటుంది. ఈ లోపల వంటవుతుంది" చుట్టాలతో చెప్పినట్లుగా, ఇంగ్లీషులో చెప్పాడాయన.

"నాకు తెలుగు వచ్చునండీ" మొదటిసారిగా నోరువిప్పాను.

"ఐసీ! అయితే ఇంకేం! మా తెలుగువారేనన్నమాట" మాటలలో ఎంతో అభిమానం,

"తెలుగు వాడిని కానండీ; గుజరాతీని" మెల్లగా చెప్పాను.

"ఓహో! అలాగా!"

స్నానంచేసి పడుకుంటే నా ప్రాణం ఎక్కడికో ఎగిరిపోయింది. మెలకువ వచ్చి చూసేసరికి ఎదురుగా తనవంకే చూస్తూ కూర్చుంది మున్నీ. తను కళ్ళు తెరవగానే చిన్నగా నవ్వింది.

"నిన్నేమని పిలవాలి?"

ఆమె కంఠస్వరానికి ఒక్క క్షణం ముగ్ధుడినయి పోయాను.

"పర్దేశ్ భయ్యా" అని నాకంఠంలో ఎన్నడు ఎరుగని మృదుత్వం తొంగిచూసి నన్నే ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. భోజనాల సమయంలో మున్నీ అమ్మ అడిగిన ప్రశ్నకి తడుముకోకుండా అబద్ధమాడేశాను. అద్దెగదికోసం తిరిగితిరిగి చివరికి వాళ్ళింటి ముందు శోషవచ్చి పడిపోయానని చెప్పాను.

"చెప్పారు కారేం? మా మేడమీది గది ఖాళీగానే వుంది. మీ కభ్యంతరం లేకపోతే హాయిగా వుండిపోవచ్చు"

"మరి అద్దెమాట" ఎంతో మర్యాదస్తుడిలా అడిగాను.

"అద్దెగిద్దె జాన్తానై! ఉంటే ఊరికే ఉండండి! మా మున్నీకి స్నేహితుడు, మాస్టారు ఇద్దరూ దొరికినట్టవుతుంది" బిగ్గరగా నవ్వేశాడాయన,

"అశ్రిసిస్తే నాన్నగారికి ఉత్తరం రాస్తాను బాబూ" మృదువుగా వినిపించిన మాటలతో ఈప్రపంచంలో కొచ్చి పడ్డాను.

"అబ్బే! ఎందుకు? వద్దండి" కలవరపాటుని కప్పిపుచ్చుకుంటూ అన్నాడా పదహారేళ్ళ యువకుడు నాచూపు వారిద్దరిమీదా నిలిచిపోయింది.

"అదేం! ఎందుకని?"

అతను మౌనముగా వుండిపోవటంతో మళ్ళీ మున్నీయే అడిగింది "నువ్వేంచేశావసలు!

ఎందుకింత భయపడుతున్నావు బాబూ"

"మీకు తెలీదండీ! ఇంట్లో చెప్పకుండా వచ్చేశాను. ఇప్పుడు కనిపిస్తే నాన్న వీపు చిట్లగొట్టేస్తారు' భయం భయంగా అన్నాడతను.

"పిచ్చి తమ్ముడూ!" జాలిగా అంటూ అతని తలమీద చెయ్యి వేసింది మున్నీ "ఒక తప్పు చేశావు ఆ తప్పుని కప్పిపుచ్చుకోటానికి మళ్ళీ ఇంకొక తప్పా! ధైర్యంగా ఇంటికి వెళ్ళి, చేసిన తప్పుని నిర్భయముగా ఒప్పుకో తప్పు చెయ్యకుండా ఉన్న ఆనందం కన్నా ఆ తప్పుని ఒప్పుకోవటములోనే ఎక్కువ ఆనందం ఉంది తమ్ముడూ! ఇంక శిక్ష సంగతంటావా? తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే."

మళ్ళీ ఆ వేమాటలు చిన్ననాటి భావాలనే విపులంగా వివరిస్తున్న మున్నీ కేసి ఆశ్చర్యముగా చూసాను. మళ్ళీ గతం గుర్తుకొస్తోంది.

"పుస్తకం చదువుతున్న దల్లా మున్నీ గభాల్న తల పైకెత్తింది"

"సర్దేశ్ భయ్యా! దేవుడెక్కడున్నాడు? హఠాత్తుగా అడిగింది.

పిక్ పాకెటింగ్ లో ఆరి తేరిన నన్ను, దోపిడీలలో కాకలు తేరిన నన్ను, అవసరం వస్తే ఖూనీలు చెయ్యటానికి కూడా వెనుకాడని పాతికేళ్ళ నన్ను ఏడేళ్ళ మున్నీ 'దేవుడెక్కడున్నాడు' అని అడిగింది నవ్వొచ్చింది నాకు.

కుతూహలముతో నన్నే చూస్తున్న మున్నీని చూసి "దేవుడసలు లేడు మున్నీ" అన్నాను.

నన్ను పిచ్చివాడిని చూసినట్టు చూసి, న అజ్ఞానానికి జాలిపడుతున్నాట్టుగా నవ్వింది మున్నీ. "కాదు సర్వేశ్ భయ్యా! నీకు తెలీదు! దేవుడున్నాడు!"

ఎంతో విశ్వాసంతో చెపుతున్న మున్నీని చూస్తే పగలబడి నవ్వాలనిపించింది నాకు, "ఎక్కడున్నాడు? నీకెప్పుడయినా కనిపించాడా మున్నీ?" వస్తున్న నవ్వాపుకుంటూ ఎగతాళిగా అడిగాను.

"ఎక్కడున్నాడో తెలీదు సర్దేశ్ భయ్యా! కానీ తప్పకుండా కనిపిస్తాడు" ఎంతో నమ్మకంగా చెప్పింది మున్నీ.

ఆ మాటలు వింటుంటే నా

ఒళ్ళు చిరచిరలాడింది. అందుకే సంభాషణ మార్చేశాను.

"సరేశ్ భయ్యా; అటుచూడు అటుచూడు:" మున్నీ చూపించిన వేపు చుసిన నాకు, గేటుముందు ఒక్క గోచీ తప్ప మరే ఆచ్ఛాదనా లేకుండా, చలిలో వణుకుతూ నిలబడ్డవృద్ధుడు కనిపించాడు. తలతిప్పిచూస్తే మున్ని లేదు.

"ఇంతలోనే ఏమయిందబ్బా" అనుకుంటుండగానే లోపలికి వెళ్ళినమున్నీ ఒకరగ్గు తెచ్చిఆవృద్ధుడికి కప్పింది. అతను మున్నీ కేదో దీవిస్తున్నాడు. మున్నికళ్ళు ఆనందంతో మిలమిలా మెరుస్తున్నాయి.

"అదేమిటి మున్నీ! నాన్నగారొస్తే ఏంచెపుతావు?" ఆశ్చర్యముగా అడిగాను.

"తాతకి కప్పానని చెపుతాను"

'అలాచెప్తే కొడతారేమో మున్నీ! నాకిచ్చానని చెప్పు! నేనునిజానంగా అటువంటిదే ఇంకోటి తెచ్చిపెడ్తాను' అపద్భాంధవుడిలా అన్నాను.

విచిత్రంగా చూసిందిమున్ని.

'అబద్ధం చెప్పటం తప్పుకాదూ సరేశ్ భయ్యా! తప్పుచేస్తే దేవుడికోపమొస్తుందిట' కిలకిలా నవ్వుతూ పరిగెత్తిందిమున్ని.

"చెళ్ళున చరిచినట్లయింది నాకు. నాఅబద్ధం వికృత రూపంలో నన్ను వెక్కిరించింది'.

"మేడమ్! ఈ పేషెంటు చూడండి! మందు తాగటంలేదు" అన్న సిస్టర్స్ మాటలతో నా ఆలోచనలకి అంతరాయం కలిగింది.

"అలాగంటే ఎలా సిస్టర్! తాగించాలి! అదిలాతే!" ఔన్సు గ్లాసు తీసుకుని ఆ పేషెంటు బెడ్ మీద కూచిందిమున్ని. అతనికి సుమారు ముప్పయ్యేళ్ళుండవచ్చు.

'అది మందు కాదు, నువ్వు డాక్టరివికావు. నువ్వొక యమదూతవి అందుకేవిషమిస్తున్నావు' కసిగా అన్నాడతను.

చిన్నగానవ్వుతూమారుమాట్లాడకుండా బలవంతముగా మందుని అతననోట్లో పొయ్యటానికి ప్రయత్నిస్తోంది మున్ని.

అతను కనిపెట్టలేక ఆమె చేతిని గట్టిగా కొరికాడు.

'అబ్బా!' ఒక్కక్షణం బాధ

తో కళ్ళు మూసుకొంది మున్ని.

సంకోచంతో వికృతంగా నవ్వాడతను.

"బ్రూట్! వాడి ఖర్మానికి వాడినొదిలిపెట్టండి మేడమ్! కల్చర్ తెలియని డర్టీ విలేజ్ క్రీచర్." "సిస్టర్!" గర్జించింది మున్ని అంతలోనే చిరునవ్వు నవ్వుతూ "హాస్పిటల్లో జాయిన యితే తప్ప మరి గత్యంతరం లేని పరిస్థితుల్లో వాళ్ళొచ్చి ఇక్కడ జాయిన యితే, మనం వాళ్ళని నీచంగా చూడటం మంచిది కాదు సిస్టర్! వాళ్ళబాధని మనం సానుభూతితో అర్థంచేసుకోవాలి అతనికి మనుషులంటే అంతకసి పెరగటానికి కారణం జీవితంలో దారుణంగా దగా చెయ్యబడి వుంటాడు"

విచిత్రంగా చూశాడతను. మారు మాట్లాడకుండా మందు తాగేశాడు. మున్నీ చిరునవ్వు లో అంత బలంవుంది. అంత బాధ లోను ఆమె పెదవులమీది చిరు నవ్వుమాత్రం చెదరలేదు.

మనస్సు మళ్ళీ వెనక్కి పరుగె త్తింది. ఆ దేవుమూగుణం: ఆనా టికీ ఈనాటికీ చెరగలేదు సరికదా నానాటికీ వృద్ధిపొందింది.

ఆనాడు తనకి చక్కటి మేత దొరికింది. అంతులేని ఆనంద ముతో ఇంటికి చేరుకున్న తను లోపలినుంచీ వినబడుతున్న మాటలకు, మెట్లదగ్గరే ఆగిపో యాడు.

"మీరు కాని పొరబడ లేదు కదా! అతను కాదేమో! సరిగా చూశారా!" సందేహంగా అడు గుతోంది. మున్నీ అమ్మ.

"లేదు లక్ష్మీ! అతను నన్ను చూడలేదుగాని నేనతడిని బాగా గుర్తుపట్టాను. మున్నీకి చేయించిన గొలుసు అతడే అపహరించాడు." చాలా ధృఢంగా చెపుతున్నాడు మున్ని నాన్న.

"అయితే సరాసరి పోలీస్ కంప్లయింట్ ఇవ్వకుండా ఎందుకు వొచ్చారు! దుర్మార్గుడు! తిన్న ఇంటి వాసాలే లెక్కపెడుతు న్నాడు. అక్కడేదో ఉద్యోగమని అంతసంపాదిస్తున్నానని ఇంత సంపాదిస్తున్నానని ఎన్ని అబద్ధాలు చెప్పాడు" కోపంగా అంటోంది మున్నీ అమ్మ, పొరపాటు చేశాను

త్తే! పోనీ ఇప్పుడు వెళ్లి పోలీసులకు రిపోర్టు చెప్పొస్తాలే" కూచున్న చోటు నుంచీ లేచారు మున్నీ నాన్న.

ఒద్దు నాన్నా! పోలీసులకి చెప్పొద్దు వాళ్ళు సద్రేశ్ భయ్యాని కొట్టరూ!" అదిరి పడ్డాను జేబులోని గొలుసు తీసి చూశాను.

"మున్నీ" ఆశ్చర్యంగా అన్నారు మున్నీ నాన్న

"ఔను నాన్నా! పోతే పోయిందిలే! సద్రేశ్ భయ్యాని ఏం చెయ్యొద్దు నాన్నా! చెప్పు నాన్నా! సద్రేశ్ భయ్యాని కొట్టవు కదూ" ఏడుస్తుంది,

ఔను మున్నీ ఏడుస్తోంది. తన గొలుసు పోయినందుకు కాదు తన సద్రేశ్ భయ్యాని కొడతారేమోనని పిచ్చిగా నవ్వుకున్నాను.

వెనక్కి తిరిగి చూడకుండా తిరిగి వచ్చేశాడు తను.

ఆనాటికి, ఈనాటికి మళ్ళీ మున్నీ కన్పిస్తోంది. కళ్ళు మూసుకున్నాను.

"సద్రేశ్ భయ్యా!" తియ్యగా పిలిచింది మున్నీ.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఎదురుగా నా మొహంలోకే చూస్తూ చిరునవ్వు నవ్వుతోంది మున్నీ

"నేను సద్రేశ్ భయ్యా! మున్నీని మళ్ళీ అదే నవ్వు. మార్పు! లేదు.

"గుర్తు పట్టాను మున్నీ" మెల్లిగా అన్నాను.

"నాకు తెలుసు సద్రేశ్ భయ్యా నువ్వు నన్ను మర్చిపోవు. కళ్ళు మూసుకుని రెస్టు తీసుకో. మళ్ళీ వస్తాను" మెల్లిగా కదిలి వెళ్ళిపోయింది. మున్నీ.

ఇప్పుడు తను చేసిన పని తెలిస్తే మున్నీ ఏమంటుంది? తప్పు చేస్తే శిక్ష అనుభవించే తీరాలంటుందా?

ఎప్పటికీ అనదు. తన మున్నీ తనని పోలీసులకు పట్టివ్వదు. ఆ సంగతి తనకు బాగా తెలుసు నవ్వుకున్నాను.

కళ్ళ ముందు నే చూసిన భయంకర దృశ్యం తాండవం చేస్తోంది.

తను ఆనాడు కలకత్తా నగరాన్ని విడిచి పెట్టేశాడు. ఆతర్వాత ఎన్నో ఊళ్ళు తిరిగాడు. మరెన్నో దొంగతనాలు చేశాడు. ఒకటి రెండు హత్యలకి కూడా వెనుకాడ లేదు

తన ఇరవై అయిదో సంవత్సరం నుంచే దొంగతనాలు చేస్తున్నాడు. దొంగతనాలు చేస్తూ

మరో పాతికేళ్ళుగా సి.ఐ.డి డిపార్ట్‌మెంటుకి దొరక్కుండా పాతికేళ్ళు గడిపేశాడు తిరుగుతున్న తన వాళ్ళను నెలకి క్రితంలాయర్ ధర్మారావు పట్టుకున్నాడు. పట్టుకోవడమే కాదు యావజ్జీవ కారాగార శిక్షను విధింపచేశాడు.

అందుకే తనకు అతనంటే కసి, అంతు లేని ద్వేషం తనని పట్టుకోవడమా! జైల్లో వున్న నాలుగేళ్లల్లో తన ద్వేషం ఇంకా పెరిగింది. పగ, కసి ఒళ్ళు విరుచుకున్నాయి. ఫలితంగా మరునాడు తను జైల్లో లేడు.

జైల్లోంచి తప్పించుకున్న రాత్రే లాయర్ ధర్మారావు మేడమీదికి చేరుకున్నాడతను.

తన ఉద్దేశ్యం దొంగతనం కాదు. దోపిడీ అంతకంటే కాదు. కావలసింది నాలాంటి వాళ్ళ పాలిటి యముడైన ధర్మారావు ప్రాణాలు కావాలి.

అడుగులో అడుగు వేసుకుంటూ లా బుక్స్ని చూసుకుంటున్న ధర్మారావు వెనగ్గా నిలబడ్డాడు తను.

కత్తి తీసి, వికటంగా నవ్వుకున్నాడు. ఈ కత్తిని అతనిగుండెలకి వియ్యమందింప జేస్తే ... వికృతంగా చిన్నగా నవ్వాడు

ఉలిక్కిపడి వెనుతిరిగాడు ధర్మారావు, వికటంగానవ్వుతున్నాడు తాను,

"పిరికి! ఆరోజు నా చేతులకి సంకెళ్ళు వేసి నన్ను బోనులో నిలబెట్టి నవ్వుకున్నాడు! ఇప్పుడు చెప్పు! నీ ప్రాణాలు నా గుప్పిట్లో వున్నాయి నిన్ను రక్షించే నాథుడెవరు? హా...హా...హ్హా!

"నీక్కావలసింది నా ప్రాణాలేగా సర్ధేశ్! దానికింత హంగామా ఎందుకు? నిరభ్యంతరంగా తీసుకో" చిరునవ్వుతో అంటున్న ధర్మారావుని చూసి, పగలబడి నవ్వుతున్న తనుటక్కున ఆగిపోయాడు.

"ఏమిటతని ధైర్యం! తన ప్రాణమంటే ఏమాత్రం లక్ష్యంలేదు

పిచ్చిగా తనముఖంలోకి చూస్తున్న సర్ధేశ్ని చూసి చిరుగా నవ్వాడు ధర్మారావు". ఊ! కానియ్! ఆలస్యమెందుకు? హెచ్చరించాడు

ఉలిక్కి పడ్డాడు తను. ఎవరో పైకివస్తున్నారు. పారిపోదామనుకున్నాడు కానీతన లక్ష్యంగుర్తు

కొచ్చి ఖంగారుగా అతడ్ని పొడిచి వెనుతిరిగి చూడకుండా డాబా మీదకి చేరుకున్నాడు. పైకి మనుషులొచ్చేశారు. ఇప్పుడెలా ఒక్క క్షణం పాటు యోచించిన తను మేడమీదనుంచి ఒక్కదూకు దుకేశాడు.

అంతే! కళ్ళు తెరిచేసరికి ఈ హాస్పిటల్లో వున్నాడతను. తాను చేసిన హత్య మూలంగా యాదృచ్ఛికంగా మున్నీని కలుసుకున్నాడు.

రోజులు గడచిపోతున్నాయి. మున్నీ చాలా మామూలుగా వచ్చి వెడుతోంది. ఆప్యాయంతో పలకరిస్తుంది.

మున్నీ నన్నొక్కడినే కాదు. అందరినీ అలాగే చూస్తుంది.

నా ఎడమ కాలు తీసేశారు. ఎడమ చెయ్యి మణికట్టు వరకు పోయింది. ఆరోజున విపరీతంగా ఏడ్చాను నేను. కాలు, చెయ్యి పోయినందుకు కాదు. ఇక మీద నా వృత్తి ఎలా సాగాలి? నేనెలా బ్రతకాలి?

ఇదీ నా సమస్య.

మున్నీ గోలునుదొంగిలించిన నాకు మున్నీ ఆప్యాయత భరించరానిదిగా ఉంది

"సర్దేశ్ భయ్యా! నిన్ని వాళిటితో డిశ్చార్జి చేస్తున్నాము!"

"అదేమిటి మున్నీ!" ఎక్కడికి పోవాలో అర్థంకాలేదు తనకు

"ఔను సర్దేశ్ భయ్యా! మా ఇంటికి వెళదాం రా!" నన్ను లేపింది మున్నీ.

"... ఇంటికా?" ఏదో భయం.

"ఔను సర్దేశ్ భయ్యా! నీ మున్నీ భర్తని చూడకుండానే వెడతావా?" చిరునవ్వుతో నన్ను లేపింది. సపోర్టెడ్ లెన్‌తో నడవటం పూర్తిగా రాని తనకు మున్నీ భుజం ఆసరాగా ఇచ్చి ఇంటికి తీసుకు వెళ్ళింది.

ఆ ఇంటి నెప్పుడో చూసినట్టుంది చీకట్లో చూశాను

ఔను గుర్తుకొచ్చింది అది లాయర్ ధర్మారావు ఇల్లు

"చూడు సర్దేశ్ భయ్యా! ఈయనే నీ మున్నీ భర్త! ధర్మారావు గారు" చిరునవ్వుతో పరిచయం చేసింది. ధర్మారావు కుడి భుజానికి కట్టు. తనగురి తప్పిందన్న

మాటవచ్చిపోయాను. నేనెక్క-
డికి వచ్చాను?"

ఇదేమిటి? నాలో ఈ బాధ ఎక్కడినుంచి మొదలైంది?

"కూచో సర్వేశ్!" చిరునవ్వుతో మర్యాద చేస్తున్నాడు ధర్మారావు.

మతి పోతుందినాకు, ఏమిటి దంతా? రహస్యం దాచాలని ప్రయత్నిస్తున్నాను. కాని సాధ్యం కావటంలేదు.

"మున్నీ! నేను..." నా వాక్యం పూర్తి కానేలేదు. మున్నీ చిరుగా నవ్వింది.

"నువ్వేం చెప్పనక్కరలేదు. సర్వేశ్ భయ్యా! నాకంతా తెలుసు" స్వచ్ఛంగా నవ్వుతోంది మున్నీ.

"చిన్ననాడు ఆమెగోలుసు అపహరించిన తనుఈనాడేమో ఆమె మాంగల్యాన్నే అపహరించబోయాడు.

ఆ సంగతి తెలిసీ మున్నీ నాకు చికిత్స చేసింది. తను నవ్వింది. నన్ను నవ్వించింది.

హంతకుడిని తెలిసీ మళ్ళీ తన ఇంట్లో స్థానమిచ్చింది.

తానుతనని చంపటానికి ప్రయత్నించాడని తెలిసీ తనను గౌరవిస్తున్నాడు ధర్మారావు

ఎన్నో పాపాలు చేసినతనలో ఏమిటీబాధ? ఎందరివో కన్నీళ్ళు చూసి ఆనందించినతనకన్నీళ్ళు రాబోతున్నాయి.

తనకి దుఃఖం? ఆవేదన? పోలీసులకి పట్టిస్తారని భయమా?

"ఊహు! కాదు! తనకా భయం పోయింది. మరేమిటి?

భగవాన్! దీన్నే పశ్చాత్తాపమంటారేమో

పిచ్చిగా వాళ్ళిద్దరి వంకా చూశాను అదే చిరునవ్వు. పాల నురగలాంటి స్వచ్ఛమైనవ్వు

మున్నీ! నిష్కృతి లేనంతటి పాపంచేశాను మున్నీ. నువ్వేందుకు తిట్టవు మున్నీ నన్ను తిట్టు శాపనార్థాలు పెట్టు! నన్ను నిలువునా చీల్చేయిమున్నీ! నేనీ బాధ భరించలేను కుడిచేతితో ముఖం కప్పుకుని కూలబడ్డాడుతను.

రాతి వంటి నా గుండె కరుగుతోంది.

శిలవంటి నా మానవత్వం కరిగి కన్నీరుగా వెలుపలికివస్తోంది

భరించలేక మున్నీ పాదాల మీద తలపెట్టి ఏడుస్తున్నాను

నేను. నా తలమీద మృదువైన హస్తం పడింది. మెల్లిగా తలెత్తాను.

"సర్దేశ్ భయ్యా! నిన్ను నేనెందుకు తిట్టాలి? ఎందుకు కొట్టాలి? నాకు తెలుసు సర్దేశ్ భయ్యా! నువ్వు మారుతావు. నీలోని భగవంతుడు తప్పకుండా నిద్రలేస్తాడు ఆ సంగతి నాకు ఖచ్చితంగా తెలుసు సరేశ్ భయ్యా! నీలోని దేవుడు తలెత్తిన రోజున నీలో పశ్చాత్తాపాన్ని మించిన శిక్షేముంది సర్దేశ్ భయ్యా!

తప్పుచెయ్యటంకన్నా ఆ తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడటంలోనే దైవత్వముంది. సరేశ్ భయ్యా! పశ్చాత్తాపం చెందిన మనిషిలోనె దేవుడున్నాడు.

నీకు గుర్తుందా సర్దేశ్ భయ్యా ఆనాడు నన్ను దేవుడెక్కడున్నాడు అని అడిగితే లేడన్నావు. నేను తప్పకుండ దేవుడిని చూస్తానన్నాను, నిజంగానే చూస్తున్నాను సరేశ్ భయ్యా! దేవుడెక్కడో రాళ్ళలోను, రప్పల్లోను లేడు. నీలాంటి మనుషుల్లోనే దేవుడున్నాడు నీలోనే కాదు సర్దేశ్ భయ్యా! నన్ను కొరికిన గోపాల్ లోను, ఇంటి నుంచి పారిపోయిన కిరణ్ లోను కూడా దేవుడు కన్పించాడు

నీ పశ్చాత్తాపం నీ మలినాన్ని కడిగేసింది సర్దేశ్ భయ్యా! ఎన్ని న్యాయవాదులు కలిసినా నీలో ఇటువంటి పశ్చాత్తాపాన్ని కలిగించగలరా? లే సరేశ్ భయ్యా! మానవుడిగా నిలబడు. ఆదే నీ యీ మున్నీ కోరేది చిన్నగా నవ్వుతూ చెప్పింది మున్ని. ఏదో పొర విడిపోయినట్టయింది నాకు. ఏదో వెలుగు గోచరిస్తోంది. అది ఆరని వెలుగు. దీప కళికలా కలకాలం వెలుగుచూపే జ్యోతి నిజం దేవుడున్నాడు కానినాలో కాదు మున్నిలో వున్నాడు మున్ని రోగులకోసం కేటాయించిన కాంతికిరణంలో వున్నాడు

గభాలున లేచాను. జేబులో చెయ్యి పెట్టి గొలుసు తీశాను

మున్నీ! ఈ గొలుసు నీదమ్మా! ఎన్ని అమ్మినా దీన్ని మాత్రం అమ్మలేకపోయాను, నీది నువ్వు, తీసుకోమ్మా? నీ ఈ సర్దేశ్ భయ్యాని మర్చిపో మున్నీ! ఎప్పుడైనా గుర్తొస్తే రెండు కన్నీటిబొట్లు రాల్చమ్మా! అంతే చాలు: వస్తా వెడుతున్నాను ధర్మారావు గారూ

మళ్ళీ రావటం మాత్రం జరగదు" అంటూ గొలుసు మున్నీకిచ్చాను మౌనంగా మెళ్ళో పెట్టుకుంది మున్నీ, సంతోషంతో వెనుతిరిగిన నన్ను "ఎక్కడికి వెడుతున్నావు అర్దెక్ భయ్యా! మృదువుగా సడిగింది మున్ని,

"నా శేష జీవితాన్ని శ్రీకృష్ణ జన్మస్థానంలో గడపనివ్వమని పోలీసులకి అప్లయి చేసుకుంటాను మున్నీ" దృఢనిశ్చయంతో చెప్పాను. ఈనాటికి స్వచ్ఛంగా నవ్వగలిగాను. మున్ని మౌనంగా చెరగని పాలనురగలాంటి స్వచ్ఛమైన నవ్వుతో. కళ్ళు తుడుచుకుంది.

పిక్ పాకెటింగ్ లో ఆరితేరిన నా లో, దోపిడీలలో కాకలు తీరిన నా లో, హత్యలు చెయ్యడానికి వెనుకాడని నాలో ఓ జ్యోతి దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ జ్ఞాన జ్యోతిని వెలిగించిన మున్ని జీవితం కూడా అలాగే వెలుగొందాలని మున్నిలోని భగవంతుణ్ణి ప్రార్థించాను ★

# ఎదురు చూద్దాం

రచన: వి. వరప్రసాదరావు

భారత దేశంలో
నిజంగా బాపూజీ
బంగరు కల ఫలియిస్తుందా
రాజ్యాంగం గౌరవించబడి
దారిద్ర్యం పారద్రోలబడి
"లోకాః సమస్తాః సుఖినోభవంతు"
అనే ఆర్యోక్తి గౌరవించబడుతుందా?
కలిగినవాడు
కాలు తీసేవరకే
పోయే పేదవాడి ప్రాణం
పోకుండా ఆగుతుందా?
మూడుపదుల వయస్సుదాటినందుకైనా
ముచ్చటకోసమైనా మన రాజ్యాంగాన్ని
యికనుండైనా గౌరవించుదాం
పెద్దరికాన్ని గౌరవించుదాం
లోపాల్ని సరిదిద్దుకుందాం
పెద్దని పెద్దగానే వుండనిద్దాం.
గతాన్ని త్రవ్వుకోవద్దు
చెడును ఆదర్శంగా తీసుకోవద్దు
రాజ్యాంగాన్ని పరిరక్షించి
న్యాయాన్ని గౌరవించే
రాజకీయాలకోసం
కొండంత ఆశతో
ఎదురు చూద్దాం.